సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం | 21 | జనవరి | 2024



రూ.లక్ష విరాళం

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి అంత రాలయం, మహా మండప నిర్మాణానికి బోడపాటి శ్రీను, వాణి దంపతులు (పాలకొల్లు) రూ.లక్ష విరాళం సమర్పించారు.



వెండి శఠగోపం సమర్పణ

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో వేంచేసియున్న దత్తాత్రేయ స్వామికి పూర్వపు కాకినాడ ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ శనివారం 470 గ్రాముల బరువైన వెండి శఠగోపం సమర్పించారు.

డెల్టాలకు 10,450 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు శనివారం 10,450 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.15 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

వీరేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.24.91 లక్షలు



వీరేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, పాలక మండలి సభ్యులు, ప్రజలు

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి దేవస్థానంలో హుండీల ఆదాయం గణనీయంగా పెరిగిందని ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం దేవదాయ శాఖ తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు సమక్షంలో ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ప్రధాన హుండీ ద్వారా రూ.12,38,089, నిత్యకల్యాణం కట్న కానుకల హుండీ ద్వారా రూ.10,69,539, అన్నదాన హుండీ ద్వారా రూ.1,83,037 ఆదాయం వచ్చిందన్నారు. 150 రోజులకు గాను మొత్తం రూ.24,91,011 సమకూరిందన్నారు. గతం కంటే రూ.4,91,011 అదనంగా వచ్చిందని అన్నారు. 22 విదేశీ నోట్లు వచ్చాయన్నారు. ఈ లెక్కింపులో ధర్మకర్త మండలి సభ్యులు, అర్చకులు, పండితులు, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు

అమలాపురం టౌన్: స్థానిక భోగరాజు వీధిలో పది రోజులుగా రోడ్డు చెంతనే ఉన్న కారును శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ కారు నంబరు ఆధారంగా సీ బుక్‌పై పేరున్న వ్యక్తికి పోలీసులు ఫోన్ చేస్తే ఆ కారు తనది కాదని చెప్పాడు. దీంతో మెకానిక్‌ను తీసుకు వెళ్లి కారు లాక్ తీసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో అదే వీధికి చెందిన ఓ వ్యక్తి వచ్చి ఆ కారు తనదని చెప్పాడు. కారుకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలను చూపించాలని పోలీసులు అడిగారు. ప్రస్తుతం అందుబాటులో లేవని, వాటిని తీసుకువచ్చి చూపిస్తానని పోలీసులకు ఆయన చెప్పాడు. సంక్రాంతికి ఊరెళ్తూ కారును రోడ్డు చెంత పార్క్ చేసి వెళ్లానని వివరించాడు. కారును పోలీసులు స్వాధీనం చేసుకుని ఒరిజినల్ పత్రాలు చూపించిన తర్వాత ఇస్తామని చెప్పారు. కారు యజమానిగా చెబుతున్న వ్యక్తి ఒరిజినల్ పత్రాలు చూపించాక పూర్తి స్థాయిలో విచారిస్తామని డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ తెలిపారు.

రూ.2.85 లక్షల సరకు జప్తు

కాకినాడ సిటీ: జిల్లాలో నిత్యావసరాల చట్టం -1955 సెక్షన్ 6ఏ కింద నమోదైన 7 కేసులపై జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ శనివారం విచారణ జరిపారు. ఈ కేసులలో సీజ్ చేసిన రూ.2,84,658 విలువైన సరకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న ఒక వాహన యజమానికి రూ.7 వేలు, అక్రమాలకు పాల్పడిన ఇద్దరు ఎరువుల దుకాణాల యజమానులకు రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. ఈ మొత్తాలను సివిల్ సప్లయిస్ ఖాతాకు జమ చేయాలని ఆదేశించారు. నిత్యావసరాల చట్టం ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ ఇలక్కియ హెచ్చరించారు.

భారవికి వేటూరి పురస్కారం

29న ప్రదానం



తుని: తెలుగు సినీ రచయిత, దర్శకుడు జేకే భారవిని వేటూరి పురస్కారానికి ఎంపిక చేశామని వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి కలగా రామజోగేశ్వరశర్మ శనివారం తెలిపారు. ఇప్పటి వరకూ 12 మంది సినీ, సాహితీ రంగ ప్రముఖులకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశామన్నారు. తుని చిట్టూరి మెట్రోలో ఈ నెల 29న భారవికి వేటూరి పురస్కారం ప్రదానం చేయనున్నామని శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు విజయ్ ప్రకాష్ తెలిపారు.

ఆట అదిరేలా..

- జిల్లాలో జోరుగా 'ఆడుదాం- ఆంధ్రా'
- పండగ ముగిసినా వీడని సందడి
- హోరాహోరీగా మండల స్థాయి క్రీడలు
- పోటీల్లో తలపడుతున్న 56,451 మంది క్రీడాకారులు

సాక్షి, అమలాపురం: భోగి మంటలు.. సంక్రాంతి సందడులు.. కనుమ సంబరాలు ముగిశాయి. ఈ పండగలను పురస్కరించుకుని నిర్వహించిన కోడి పందేల బరులూ ఆగిపోయాయి. ఇప్పుడు తిరిగి జిల్లాలో 'ఆడుదాం- ఆంధ్రా' క్రీడోత్సవాలు మొదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పోటీలు గ్రామ, వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ జరుగుతున్నాయి. తొలి అంకం ముగియగా, మండల స్థాయిలో పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగుతున్నాయి.

జిల్లాలో 'ఆడుదాం- ఆంధ్రా' క్రీడా సంరంభం హోరాహోరీగా జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు విశేష ఆదరణ లభిస్తోంది. నాలుగు దశల్లో జరిగే ఈ క్రీడల్లో ప్రస్తుతం మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నారు. తొలిదశలో సచివాలయాల మధ్య క్రీడలు జరగగా, అక్కడ విజయం సాధించిన జట్లు మండల స్థాయిలో తలపడుతున్నాయి. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ వంటి పోటీలు జోరుగా సాగుతున్నాయి. జిల్లాలో 22 మండలాలు, మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 515 సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఈ పోటీల్లో 56,451 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఇందులో పురుషులు 32,954 మంది కాగా, మహిళలు 23,494 మంది ఉన్నారు.



అంబాజీపేటలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు



ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో సాగుతున్న కబడ్డీ పోటీలు

అంచనాలకు మించి రిజిస్ట్రేషన్

'ఆడుదాం- ఆంధ్రా' పోటీలకు జిల్లాలో అంచనాలకు మించి క్రీడాకారులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. మొత్తం ఐదు క్రీడాంశాల్లో 1,17,420 మంది పాల్గొనాలని లక్ష్యంగా నిర్ణయించగా 1,18,536 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. పురుషులతో ఇంచుమించు సమానంగా మహిళలు కూడా లక్ష్యానికి మించి పాల్గొంటున్నారు. జిల్లాలో ఆలమూరు, అల్లవరం, ఆత్రేయపురం, రాజోలు మండలాల్లో లక్ష్యానికి మించి మహిళల రిజిస్ట్రేషన్లు జరిగాయి. పురుషుల్లోనూ ఆలమూరు, అల్లవరం, ఆత్రేయపురం, ఐ.పోలవరం, కపిలేశ్వరపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం, రావులపాలెం, రాయవరం, రాజోలు మండలాల్లో వంద శాతంతో మించి రిజిస్ట్రేషన్లు జరిగాయి.

నువ్వా నేనా అనేట్టు

జిల్లా వ్యాప్తంగా ఈ పోటీలు ఉత్కంఠ భరితంగా జరుగుతున్నాయి. షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నువ్వా నేనా అన్నట్టు సాగుతున్నాయి. క్రికెట్ పోటీలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున క్రీడాభిమానులు తరలివస్తుండడం విశేషం. జిల్లా కేంద్రం అమలాపురంలోని బాలయోగి స్టేడియంలో అమలాపురం మండల స్థాయిలో క్రికెట్, కబడ్డీ, ఖోఖో పోటీలు, ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతున్నాయి. అలాగే అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆ మండల పరిధిలో క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నారు. రాజోలులో డిగ్రీ కళాశాల, పొన్నమండ ఉన్నత పాఠశాలలో ఆ మండల క్రికెట్ పోటీలు జరుగుతుండగా, మిగిలిన పోటీలు రాజోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాగుతున్నాయి. రామచంద్రపురం మండలం ద్రాక్షారామ హైస్కూల్, ముమ్మిడివరం, కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, పి.గన్నవరం మండలాల్లో పోటీలు ఉత్సాహ భరిత వాతావరణంలో జరుగుతున్నాయి. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఈ నెల 20 నాటికి పోటీలు పూర్తి కావాల్సి ఉంది. సంక్రాంతి పండగల కారణంగా మరో మూడు రోజులు రిజర్వ్ డేగా ప్రకటించారు. 23 నాటికి మండల స్థాయి పోటీలు పూర్తి కానున్నాయి.

సమన్వయంతో విజయవంతం



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పోటీలను అన్ని స్థాయిల్లోనూ విజయవంతం చేసేందుకు ప్రణాళికగా ముందుకు సాగుతున్నాం. మండల స్థాయిలో పోటీల నిర్వహణకు అనుగుణంగా మైదానాలు ఎంపిక చేస్తున్నాం. పీడీలు, పీఈటీలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమన్వయంతో ఈ పోటీలను విజయవంతం చేస్తున్నారు.

– పీఎస్ సురేష్‌కుమార్, జిల్లా చీఫ్ కోచ్



వాలీబాల్ పోటీలో ఉత్సాహంగా క్రీడాకారులు



అమలాపురం బాలయోగి స్టేడియంలో ఖోఖో పోటీలో మహిళలు

రత్నగిరిపై భక్తుల రద్దీ



తిరుచ్చి వాహనంపై సాగుతున్న సత్యదేవుడు, అమ్మవారి ఊరేగింపు

అన్నవరం: రత్నగిరికి శనివారం కూడా భక్తులు పోటెత్తారు. పుష్య శుద్ధ దశమి పర్వదినం కావడంతో వేలాదిగా భక్తులు తెల్లవారుజాము నుంచే సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. దర్శనం క్యూ లైన్లు, వ్రత, విశ్రాంతి మండపాలన్నీ భక్తులతో నిండిపోయాయి. సుమారు 30 వేల మంది సత్యదేవుని దర్శించుకున్నారు. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట పట్టింది. రెండు వేల వ్రతాలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

ఘనంగా ప్రాకారసేవ

సత్యదేవుని ప్రాకార సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై వేంచేయించి, తూర్పు రాజగోపురం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి పూజలు చేశారు. అనంతరం తిరుచ్చి వాహనంపై మూడుసార్లు ప్రదక్షిణ చేయించారు. తిరిగి పూజలు చేసి, స్వామి, అమ్మవార్లను ప్రధానాలయానికి చేర్చారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ కృష్ణారావు, సూపరింటెండెంట్ పి.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

పుష్య శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం సత్యదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉదయం ఏడు గంటలకు 108 స్వర్ణ పుష్పాలతో అర్చన, ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ సహస్ర కుంకుమార్చన నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి ప్రసాదాలు నివేదించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తారు. ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రహదారి భద్రత అందరికీ ప్రధానం

- జాయింట్ కలెక్టర్ నూపుర్ అజయ్
- వచ్చే నెల 19 వరకూ రహదారి భద్రతా మాసోత్సవాలు

అమలాపురం రూరల్: ఇంటి వద్ద మన కోసం కుటుంబ సభ్యులు నిరీక్షిస్తుంటారనే ఆలోచనతో రహదారి భద్రతా నియమాలను పాటిస్తూ వాహనాలను నడపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్ సూచించారు. శనివారం నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకూ జరిగే రహదారి భద్రతా మాసోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను అమలాపురం కలెక్టరేట్‌లో ఆమె ఆవిష్కరించారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మోటారు వాహన చట్టాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. వీటిపై ప్రజల్లో చైతన్యం తీసుకు రావాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతి వాహనానికి రిజిస్ట్రేషన్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలని, వాహనదారుడికి డ్రైవింగ్ లైసెన్సు ఉండాల్సిందేనని అన్నారు. మద్యం తాగి వాహనాన్ని నడిపితే సెక్షన్ 185 ప్రకారం ఆరు నెలల జైలు శిక్ష, లేదా రూ.పది వేల జరిమానా లేదా రెండూ విధించవచ్చని ఆమె వివరించారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణించరాదని, ఈ నిబంధన అమలయ్యేలా ప్రతి డ్రైవర్ కచ్చితంగా చూడాలన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడపడం ప్రాణాలకే ముప్పు అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. కార్లలో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. సీటు బెల్ట్ ధరించకపోతే రూ.వెయ్యి, హెల్మెట్ ధరించకపోతే రూ.వెయ్యి జరిమానా, మూడు నెలల డ్రైవింగ్ లైసెన్స్ తాత్కాలికంగా రద్దు చేస్తారని నూపుర్ అజయ్ స్పష్టం చేశారు. బడి బస్సు భద్రత భావితరాలకు భరోసా ఇస్తుందని, ఆ దిశగా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడడం మంచిది కాదన్నారు. రహదారి భద్రత- జీవితానికి రక్ష అనే విషయాన్ని అంతా గమనించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాపరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, రవాణా శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



రహదారి భద్రతా మాసోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ నూపుర్ అజయ్ తదితరులు

స్వామిని చూసి.. మది మురిసి

- వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట
- ఒక్కరోజే రూ.29.18 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: ఆ శ్రీనివాసుని నామస్మరణ మార్మోగింది.. బ్రహ్మాండనాయకుడిని స్మరిస్తూ ఏడు వారాల నోము ఆచరిస్తున్న ప్రతి మదీ తరించింది.. మండలంలోని వాడపల్లి క్షేత్రం నిత్య నూతనంగా దర్శనమిచ్చింది.. ఏడుకొండల వాసుడిని చూసి అశేష భక్తజనం మురిసిపోయింది.. కోనసీమ తిరుపతిగా పేరొంది, ఆధ్యాత్మికత చాటుతున్న వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి క్షేత్రం శనివారం కిక్కిరిసింది. పండగ సెలవులు, ఆపై ధనుర్మాసాన్ని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు తరలిచ్చి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. స్వామివారు పూర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాన్ని ప్రత్యేక పండ్లు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం స్వామివారి అన్నప్రసాదాలు భక్తులు స్వీకరించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో వివిధ సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు శోభాయమానంగా జరిగాయి. ఈ ఒక్కరోజే స్వామివారికి వివిధ విభాగాల ద్వారా రూ.29,18,108 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఈ ఏర్పాట్లను కమిటీ చైర్మన్, ఈఓ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు. ఎస్సై బీవై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



వెంకన్న ఆలయం వద్ద అశేష భక్తజనం



పూర్ణాలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

శృంగార వల్లభుని సన్నిధిలో భక్తుల రద్దీ

పెద్దాపురం: తిరుపతి గ్రామంలో వేంచేసిన స్వయంభూ శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సుగంధభరిత పూలమాలలతో స్వామివారిని అర్చకులు విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. వారికి ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు. దర్శనం, అన్నదానం, కేశఖండన టికెట్ల ద్వారా స్వామి వారికి రూ.3,06,284 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం చేశారు.



ఆయిల్‌పామ్ విస్తీర్ణం పెంచాలి



ఆయిల్‌పామ్ నర్సరీని పరిశీలిస్తున్న ఆహూజా, కమిషనర్ సింగ్ తదితరులు

నల్లజర్ల: వంట నూనెల దిగుమతులు తగ్గించి, స్థానికంగానే ఉత్పత్తి చేసుకునే విధంగా రైతులు ఆయిల్‌పామ్ తోటల విస్తీర్ణాన్ని మరింత పెంచాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి మనోజ్ ఆహూజా అన్నారు. నల్లజర్ల మండలం ముసుళ్లగుంటలోని ఆయిల్‌పామ్ నర్సరీని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తామని చెప్పారు. వంట నూనెల దిగుమతికి కోట్లాది రూపాయల పన్నులు చెల్లించాల్సి వస్తోందన్నారు. అలా కాకుండా మన దేశంలోనే వంట నూనెలు ఉత్పత్తి చేసుకుంటే తక్కువ ధరలకే వంట నూనెలు అందించగలుతామని చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారానికి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని తెలిపారు. నల్లజర్ల, దేవరపల్లి, నిడదవోలు, తాడేపల్లిగూడెం మండలాలకు చెందిన రైతులు మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ రాయితీలు త్వరితగతిన చెల్లించాలని, ఈ తోటలకు ఉపాధి హామీ పథకాన్ని వర్తింపజేసి, కూలీల కొరత నివారించాలని, 1:3 నిష్పత్తిలో నిధులు కేటాయించి, పంత రహదారులు అభివృద్ధి చేయాలని కోరారు. గెలల కోత కూలీలకు శిక్షణ, ప్రమాద బీమా వర్తింపజేయాలని, తద్వారా మరింత మంది ఈ వృత్తిలోకి వస్తారని, గెలల కోత సమస్య తీరుతుందని చెప్పారు. త్రీఎఫ్ ఆయిల్‌పామ్ సంస్థ ఎండీ సంజయ్ గోయెంకా, ఆశీష్ గోయెంకాలు తమ అక్షయ నర్సరీలో పెంచుతున్న నూతన వంగడాల గురించి వివరించారు. అనంతరం ఎరువుల పంపిణీ కేంద్రం, యర్నగూడెంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ఆహూజా తదితరులు పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కమిషనర్ పీకే సింగ్, జాయింట్ సెక్రటరీ ఏకే సాహూ, జిల్లా ఉద్యానశాఖాధికారి సుజాత,ఏ లూరు జిల్లా ఉద్యానశాఖాధికారి రామ్మోహనరావు, పెదవేగి ఆయిల్ పామ్ పరిశోధన కేంద్రం హెడ్ కె.సురేష్, రామచంద్రుడు, మండల ఉద్యానశాఖాధికారి బబిత, కిలారి శ్రీనివాసరావు, విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాట్ పట్టి.. కూత పెట్టి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు

- 'నన్నయ'లో ఏపీ ఈపీడీసీఎల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యుత్తు ఉద్యోగులు

రాజానగరం/ రాజమహేంద్రవరం సిటీ: ఉద్యోగ బాధ్యతల్లో బిజీగా గడిపే వారంతా ఒక్కసారిగా బ్యాట్ పట్టారు.. కబడ్డీ కబడ్డీ అంటూ కూత పెట్టారు.. క్యారం బోర్డుపై ఎత్తుకు పైఎత్తులు వేశారు.. వాలీబాల్ ఆటలో చెలరేగిపోయారు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఈపీడీసీఎల్ 9వ ఇంటర్ డివిజన్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో విద్యుత్తు ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దీనికి రాజానగరం మండలం వెలుగుబందలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రీడా మైదానం వేదికైంది. శనివారం ఈ స్పోర్ట్స్ మీట్‌ను యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు ప్రారంభించారు. తొలుత కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పని ఒత్తిడికి గురయ్యే విద్యుత్ శాఖ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడలతో శరీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం పొందవచ్చన్నారు. అంతేకాకుండా పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి తోడ్పడతాయన్నారు. ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సూపరింటెండింగ్ ఇంజినీర్ టీవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ రెండు రోజులపాటు వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, క్యారం బోర్డ్, చెస్ వంటి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ డివిజన్లు, రంపచోడవరం, రామచంద్రపురం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేట డివిజన్లు, రాజమహేంద్రవరం సర్కిల్ ఆఫీస్ ఎంఆర్టీ డివిజన్లకు చెందిన ఉద్యోగులు పాల్గొంటున్నారన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను రాజమహేంద్రవరం గెయిల్ ఆఫీస్ సమీపంలోని బ్యాడ్మింటన్ కోర్టులో, క్రికెట్ పోటీలను కాకినాడ సమీపంలోని రామేశ్వరంలో నిర్వహిస్తున్నామన్నారు. మహిళలకు క్రీడా పోటీలు 22న రాజమహేంద్రవరం ఎస్ఈ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం విద్యుత్తు శాఖ ఈఈ నక్కపల్లి శామ్యూల్, రూరల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ, ఎస్ఏఓ. కె.ఆదినారాయణమూర్తి, విద్యుత్ శాఖ సబ్ డివిజన్ల అధికారులు, యూనివర్సిటీ పీఈటీలు పాల్గొన్నారు.

ఎంతో'టీ'... కళా కౌశలం







'టీ'ని ఉపయోగించి సత్యానందం వేసిన శ్రీరాముని చిత్రం



పెన్సిల్ ముల్లుపై లాజర్ చెక్కిన శ్రీరాముని రూపం

అనపర్తి: అయోధ్యలోని రామ మందిర నిర్మాణం ఓ మహాద్భుతం.. అక్కడ 22న విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుండటం హిందువులకు ఎంతో ఆనందదాయకం. అలాంటి ఘట్టాన్ని స్మరిస్తూ, రామ భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ వేసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. రామవరం జెడ్పీ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ మందపల్లి సత్యానందం రాముని చిత్రాన్ని విభిన్నంగా చిత్రీకరించారు. ఏ విధమైన కలర్స్ వినియోగించకుండా కేవలం మనం నిత్యం తాగే 'టీ'ని ఉపయోగించి రాముని చిత్రాన్ని, రామాయణంలోని ముఖ్య ఘట్టాలను చిత్రీకరించి అందరిచే శభాష్ అనిపించుకుంటున్నారు. అలాగే సత్యానందం నిర్వహిస్తున్న శ్రీసత్య డ్రాయింగ్ అకాడమీలో డీఎఫ్ఏ కోర్సు చేస్తున్న విద్యార్థి కె.లాజర్ పెన్సిల్ ముల్లుపై శ్రీరాముని రూపాన్ని చెక్కి ఆకట్టుకున్నారు.

'సలాది కృష్ణ'కు అంతర్జాతీయ అవార్డులు



సలాది కృష్ణ, ఫొటోగ్రాఫర్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడుకు చెందిన ఫొటోగ్రాఫర్ సలాది కృష్ణకు అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఫొటోగ్రఫీ ప్రదర్శనల్లో మూడు అవార్డులు, ఆరు మెరిట్ సర్టిఫికెట్లు లభించాయి. ఈ మేరకు ఆయా నిర్వాహకుల నుంచి అవార్డులు, ప్రశంసాపత్రాలు అందాయి. 2023 అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫిక్ కౌన్సిల్ (ఐఐపీసీ) న్యూఢిల్లీ, బెంగళూరు, ఇండోర్‌లలో నేషనల్ డిజిటల్ సర్క్యూట్ నిర్వహించిన అంతర్జాతీయ ప్రదర్శనల్లో కలర్ ఛాయా చిత్ర (పీఐడీ కలర్) విభాగంలో కృష్ణ ఫొటో 'స్పీడ్ డ్యాన్స్'కు అవార్డులు లభించాయి. వీటితో పాటు న్యూఢిల్లీ ఛాయా చిత్ర ప్రదర్శనలో కలర్స్ విభాగంలో 'జ్యూయెల్ బగ్స్'కు, బెంగళూరులో 'డైలీ వాజ్'కు, గౌహతిలో 'బ్యూటీ ఆఫ్ హెయిర్', 'స్పీడ్ డ్యాన్స్'కు, విజయవాడ ఫొటో ప్రదర్శనలో 'బ్రిక్ మేకింగ్'లకు వెరసి ఆరు చిత్రాలకు మెరిట్ సర్టిఫికెట్లు అందుకున్నారు. 2016 నుంచి అంతర్జాతీయ స్థాయి ఛాయా చిత్ర ప్రదర్శల్లో ఆయనకు అవార్డులు, ప్రశంసలు వస్తూనే ఉన్నాయి. కాకినాడకు చెందిన తుమ్మలపల్లి వీరభద్రరావు ప్రోత్సాహంతోనే అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఫొటోలు పంపిస్తున్నట్లు కృష్ణ చెప్పారు. ఆయన్ని శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గ ఫొటోగ్రాఫర్ల సంఘ నాయకులు చిక్కాల సురేష్, నామన భాస్కర్, చవల శ్రీను, కొమ్ముల ఆనంద్, ఎస్ఎంఎస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పడాల శ్రీనివాస రెడ్డి, జి.సత్యానందం, భేరి రాంబాబు తదితరులు అభినందించారు.



అవార్డులు పొందిన 'స్పీడ్ డ్యాన్స్' ఫొటో

దేశం మెచ్చే క్రీడాకారులుగా ఎదగాలి

- కలెక్టర్ కృతికా శుక్లా
- అండర్–19 జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ పోటీలు ప్రారంభం



టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కలెక్టర్ కృతికా శుక్లా

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అవకాశాలను అందిపుచ్చుకుని దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా ఎదగాలని కలెక్టర్ కృతికా శుక్లా పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా శాఖ సహకారంతో జిల్లా విద్యా శాఖ, పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన 67వ జాతీయ స్థాయి అండర్–19 పురుషుల లాన్ టెన్నిస్ పోటీలు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. దీనికి రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి భానుమూర్తి రాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కలెక్టర్ కృతికా శుక్లా, ఏఎస్పీ సత్యనారాయణ, కాకినాడ ఆర్జేడీ నాగమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో రాణించి తమ రాష్ట్రాలకు మంచి పేరు తేవాలని అన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ క్రీడలతో స్నేహ బంధాలు బలపడతాయన్నారు. క్రీడా స్ఫూర్తితో అంతా రాణించాలన్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి రాజు మాట్లాడుతూ శనివారం నుంచి 24 వరకూ జరిగే పోటీల్లో 23 రాష్ట్రాల నుంచి 119 మంది క్రీడాకారులు, 46 మంది క్రీడాధికారులు, 100 మంది లోకల్ అఫీషియల్స్ పాల్గొంటున్నారని తెలిపారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ పతాకాన్ని కలెక్టర్, పాఠశాల క్రీడా సమాఖ్య పతాకాన్ని కర్రి పద్మశ్రీ, జిల్లా ఎస్‌జీఎఫ్ఐ పతాకాన్ని కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి ఆవిష్కరించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారుల కవాతును వారు తిలకించారు. పోటీల ప్రారంభ సూచికంగా బెలూన్లు, శాంతి కపోతాలను గాలిలోకి వదిలారు. క్రీడా జ్యోతిని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ వెలిగించారు. వివిధ రాష్ట్రాల క్రీడాకారులు క్రీడా ప్రతిజ్ఞ చేశారు. 77 ఏళ్ల వయసులో అంతర్జాతీయ టెన్నిస్ పోటీలకు హాజరవుతున్న పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, ఢిల్లీలో జరిగిన జాతీయ సదస్సులో పాల్గొన్నందుకు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఏఎస్పీ సత్యనారాయణలను పాఠశాల క్రీడా సమాఖ్య తరఫున కలెక్టర్ దుశ్శాలువాతో సత్కరించారు. కలెక్టర్ కృతికా శుక్లాను భానుమూర్తి రాజు, ఆర్జేడీ నాగమణి, పోటీల నిర్వహణ కార్యదర్శి ప్రసాద్, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్‌లు సన్మానించారు. మున్సిపల్, జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. గుడిమెల్లంక విద్యార్థుల విన్యాసాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో టోర్నమెంట్ జాతీయ పరిశీలకులు తెలంగాణ నుంచి రామిరెడ్డి, ఒలింపిక్ సంఘ చీఫ్ ప్యాట్రన్ కర్రి భామిరెడ్డి, ఉప విద్యాశాఖ అధికారులు డానియేల్ రాజు, సుభద్ర, అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధి సుధాకర్, ఎంఈఓలు వాణికుమారి, రవి, గణేష్‌బాబు, ఏసుదాసు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు రవిరాజు, వై.బంగార్రాజు, రంగారావు, పట్టాభి, పీడీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.